క్లుప్తంగా

టీఆర్‌టీఎస్ ముంపు గ్రామాన్ని సందర్శించిన ఆర్డీఓ


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన కోరాడ పేటలో ఆర్డీఓ ఎంవీ సూర్యకళ మంగళవారం పర్యటించారు. టీఆర్‌టీఎస్ మట్టి పనులను నిర్వాసితులు అడ్డుకున్న నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. పునరావాస సమస్యతో పాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజీను వర్తింపజేయాలని స్థానికులు ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లారు. తమకి పూర్తి స్థాయిలో న్యాయం చేసి పనులు చేపట్టాలని కోరారు. తమ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలియజేయాలని ఆర్డీఓ రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీటీ శైలజ, గ్రామ పెద్దలు, నిర్వాసితులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం


సింగవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్

డెంకాడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతీ పేద కుటుంబానికి రూ.5వేల చొప్పున అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరిబాబు, రమణారెడ్డి, గురువులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో మొయిద జంక్షన్-1, అగురు వీధి, పద్మశాలి వీధి సచివాలయాలను నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తనిఖీలో ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు సంబంధిత పథకాలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31లోగా ఆస్తి, ఖాళీ స్థలం, నీటి పన్నులను శత శాతం వసూలు చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో మంగళవారం చండీయాగాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి కిరణ్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్న సమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

డెంకాడ: జొన్నాడ పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడు బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు ప్రారంభించారు. మంగళవారం నాడు నిర్వహించిన అన్న సమారాధన నిమిత్తం రూ.28,151 విరాళం వచ్చిందని ఆలయ ఏక సభ్య ధర్మకర్త జి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపుగిరి దేవి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


రామతీర్థంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆర్డీఓ సూర్యకళ మంగళవారం పరిశీలించారు. దేవదాయశాఖ ఈఓ వై.శ్రీనివాసరావుతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించారు. భక్తుల రద్దీ దృష్ట్యా చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు వడదెబ్బ బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, చుట్టూ చలువ పందిరలు ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న పిల్లలకు పాలు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ శైలజ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు 30వేల లడ్డూ ప్రసాదం సిద్ధం

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానం మహా శివరాత్రి సందర్భంగా దేవస్థాన అధికారులు మంగళవారం లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించారు. స్థానిక కల్యాణ మండపం ప్రాంగణంలో సుమారు 150 మంది శ్రీవారి సేవా భక్తులు సుమారు 30వేల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేశారు. సిద్ధం చేసిన లడ్డూను ఈ నెల 8 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో ఒక్కొక్కటి రూ.15 చొప్పున భక్తులకు విక్రయించనున్నారు. వీటితో పాటు పులిహోరా ప్రసాదాన్ని రూ.10 చొప్పున విక్రయిస్తారు. ప్రసాదాల తయారీను దేవస్థాన ఈఓ ఇజ్జిరోతు శ్రీనివాసరావు దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


రామతీర్థంలో లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్న శ్రీ వారి సేవా భక్తులు

శివ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం


శివజయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అన్నపూర్ణ తదితరులు


విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్యామ్ సుందర్

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివజయంతి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి బికె.అన్నపూర్ణ పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జిల్లా సేవా కేంద్రంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థానిక అయోధ్య మైదానం (ఎంఆర్ కాలేజ్ గ్రౌండ్స్)లో ఈ నెల 8న వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ సహస్ర లింగాల దివ్య దర్శనం, 10 అడుగుల మంచు లింగం, ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, దీపారాధన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. నారీ స్వశక్తికరణ స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. టీటీడీ ఆవరణలో వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జామి మండలం కొత్తభీమసింగిలో ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత భీమలింగేశ్వర ఆలయం, పార్వతీపురం మన్యం జిల్లా నవిరి కాలనీలో ఉన్న శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. దేవకీనందన్, ఆలయ అర్చకులు పీవీ.నరసింహాచార్యులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లకు సైలెన్సర్ మార్చితే చర్యలు

- విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్


శబ్ద కాలుష్యం చేస్తున్న భారీ సైలెన్సర్‌లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం క్రైమ్: నిబంధనలకు విరుద్ధంగా మోటారు సైకిళ్లకు సైలెన్సర్‌లను మార్చితే కఠిన చర్యలు తప్పవని విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్ హెచ్చరించారు. ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో మంగళవారం పట్టణంలోని నిబంధనలకు విరుద్ధంగా మోటారు సైకిళ్లకు సైలెన్సర్‌లను పెట్టి శబ్ద కాలుష్యం చేస్తున్న వాహనాలను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ సీఐ రంగనాథం, ఎస్‌ఐలు లోవరాజు, శంబంగి రవి, ఎఎం.రాజు, త్రినాథరావు సిబ్బంది బృందాలుగా ఏర్పడి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, కోట జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, దాసన్నపేట, గంటస్తంభం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. మోటారు బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిపైనా, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌లను అమర్చి శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించి, మెకానిక్స్ సహకారంతో వాటిని తొలగించి, ఈ చలానాలను విధించారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు


నెల్లిమర్ల పట్టణంలో కవాతు చేస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా పోలీసు కవాతు నెల్లిమర్ల పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు ఎస్‌ఐ డి.రామగణేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించుటలో భాగంగా స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ మీదుగా జరజాపుపేట వరకు కేంద్ర పోలీసు బలగాలను ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల పట్ల ప్రజలకు భద్రత, భరోసా కల్పించడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. మండలంలోని సతివాడ, మల్యాడ గ్రామాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ... సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని ప్రాంతాల్లోనూ ఫ్లాగ్ మార్చ్ చేపడుతున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు పోలీస్ సిబ్బందితో కలిసి కేంద్ర సాయిధ బలగాలు విధులు నిర్వర్తిస్తాయన్నారు. బందోబస్తు మాత్రమే కాకుండా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు, అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టుల్లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్


సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద పూసపాటిరేగ మండల పరిధిలో 15 లేఅవుట్లలో 903 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ఫలాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీకతీతంగా అందజేస్తున్నారన్నారు. విద్య, వైద్యం వంటి వాటికి తొలి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల చెంతకు సేవలు చేర్చుతున్నారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తున్నారన్నారు. నవ్యాంధ్రలో 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకునేందుకు నగదు అందజేశారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్ధనరావు, బర్రి చినఅప్పన్న, దాడిశెట్టి త్రినాథరావు, పి.లక్ష్మీనారాయణ, కోట్ల రఘు, మహంతి లక్ష్మణరావు, మొంగం నాగబాబు, రౌతు సాయికుమార్, తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ మాధురి తదితరులు పాల్గొన్నారు.


ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

వేడుకగా బాబా ఉరుసు మహోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక గుమ్చీ జంక్షన్ వద్ద హజరత్ సయ్యద్ తాజుద్దీన్ బాబా 77వ ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ షేక్ గౌస్ భాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. షేక్ షఫీ, సుభాని, సలామ్, భాషా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామ శివారులో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బుగత రామసూరిని అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


ఎంపీపీ జ్ఞానదీపికను సన్మానిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గజపతినగరం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌జీఓ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ నాగరికత ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్ట డంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని చెప్పారు. నేడు మహిళలు ఉద్యోగాలు, రాజకీయాల్లో పురుషులతో సమానంగా నిలుస్తున్నారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ శుభ్రత, పరిశుభ్రతతో పాటు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌ల పై కిశోర బాలికలకు, మహిళలకు దిశ చట్టం, యాప్‌పై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఎంపీపీ జ్ఞానదీపిక, పీడీ శాంతకుమారిని ఐసీడీఎస్ పీఓ నాగమణి, సూపర్‌వైజర్లు రమాదేవి, హైమావతి, పురిటిపెంట సర్పంచ్ రాములమ్మ, అంగన్ వాడీ సిబ్బంది సన్మానించారు.

మార్చురీ భవనం ప్రారంభం

చీపురుపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) సీఆర్పీ నిధులు సుమారు రూ.45 లక్షలతో నిర్మించిన మార్చురీ భవనాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీటీసీ గెరిడి రామదాసు, వార్డు మెంబర్ మీసాల రాము నాయడు, ఐఓసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలన


షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాజుకుమార్

కొత్తవలస: మండల కేంద్రంలోని సంత సమీపంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను జిల్లా పరిషత్ సీఈఓ కె.రాజ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రూ.78 లక్షలతో 14 షాపులు నిర్మిస్తున్నామని, 90శాతం పనులు పూర్తయ్యాయని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు జెడ్పీ సీఈఓకు వివరించారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ పది రోజుల్లో పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.అలాగే సమీపంలోని శిథిలావస్థకు చేరుకున్న జిల్లా పరిషత్‌కు చెందిన కల్యాణ మండపాన్ని తొలగించి, దాని స్థానంలో మరో 8 షాపులు నిర్మించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్.రమణయ్య, ఈఓపీఆర్డీ కె.ధర్మారావు తదితరులు ఉన్నారు.

సర్వజన ఆస్పత్రిలో మెరుగైన సేవలు


నెఫ్రాలజీ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం నెఫ్రాలజీ ఓపీ విభాగాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వజన ఆస్పత్రిలో ఇప్పటికే న్యూరో మెడిసిన్, న్యూరోసర్జన్, పలమనాలజీ వంటి స్పెషాలటీ వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. తాజాగా నెఫ్రాలజీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. నెఫ్రాలజీ సేవలు ఇప్పటి వరకు రోగులు కేజీహెచ్‌కు వెళ్లేవారని చెప్పారు. ఇకపై ఆస్పత్రిలోనే సేవలు అందనున్నాయని తెలిపారు. ఆస్పత్రిలో నాణ్యమైన సేవలు అందడం వల్ల అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ ఎస్.సురేష్‌బాబు, పలమనాలజిస్టు డాక్టర్ బొత్స సంతోష్, నెఫ్రాలజిస్టు డాక్టర్ రెడ్డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

విజయనగరం: నగరంలోని కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో నగరంలో పారిశుద్ధ్య సేవలందిస్తున్న 600 మంది కార్మికులకు ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు యాదవ్ చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కష్టాన్ని గుర్తించి రాష్ట్ర ఆహార కమిషన్ మెంబర్‌గా నియమించారన్నారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి విజయనగరం నియోజకవర్గ కేంద్రంగా గత ఎనిమిది నెలలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. ట్రస్ట్ ప్రతినిధులు కల్పనానాయుడు, ముద్దాడ మధు, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సూకరాజు, వజ్రపు శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు కోరారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు గత 33 రోజులుగా చేస్తున్న నిరవధిక దీక్షకు మంగళవారం అన్ని పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎక్కడైనా సరే ఏ సంస్థలోనైనా యూనియన్ పెట్టుకునే హక్కు అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. ఇన్ని రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటాన్ని యాజమాన్యం పట్టించుకోకపోవటం భావ్యం కాదన్నారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పోరాటానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, మంత్రి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, పూసపాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాదరావు, చిక్కాల సంతోష్‌కుమార్,పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని సంఘీ భావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టివి. రమణ, కె.సురేష్, కిల్లంపల్లి రామారావు, మిమ్స్ యూనియన్ నాయకులు మిరప నారాయణరావు, ఎం.నాగభూషణం, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.